9, 10 తేదీల్లో దేశభక్తి, అభ్యుదయ గీతాలపై శిక్షణ

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 9, 10 తేదీల్లో కాకినాడ యుటిఎఫ్ హోంలో దేశభక్తి, అభ్యుదయ గీతాలపై శిక్షణ ఇస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.సూరిబాబు, కెవివిగణేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎంఎంఆర్.ప్రసాద్, జివిఎస్.వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా దేశభక్తి, అభ్యుదయ పాటలపై శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. నగర పరిసరాల్లో వివిధ పాఠశాలల్లో విద్యార్థులు 9, 10 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే ఈ శిక్షణలో పాల్గొనాలని కోరారు. వివరాలకు సిహెచ్.వెంకటరమణ నెంబర్ 9010044277ను సంప్రదించాలని తెలిపారు.

పర్మిట్ రూమ్‌లకు పచ్చ జెండా

- ఇక మరింత ఏరులై పారనున్న మద్యం
- ఇప్పటికే జోరుగా 'బెల్ట్' విక్రయాలు
- జాతీయ ఎక్సైజ్ విధానానికి విరుద్ధంగా నిర్ణయం
- వచ్చే నెల నుంచే కొత్త బార్లకు, అనుమతి గదులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మద్యాన్ని ఏరులై పారించేందుకు కూటమి ప్రభుత్వం మరింత ముందుకు సాగుతోంది. ఇప్పటికే ఊరు వాడ విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయి. దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా, అక్కడ, ఇక్కడ అని కాకుండా ఎల్లవేళలా అందుబాటులో మద్యం దొరుకుతోంది. దీంతో అనేకమంది యువత పెడదోవ పడుతున్నారు. తాజాగా మద్యం షాపుల చెంతనే పర్మిట్ రూములకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల ఒకటి నుంచే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఆ రోజు నుంచే కొత్త బార్లకు అనుమతితో పాటు, మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూములను ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. పర్మిట్ రూములకు కూటమి సర్కార్ 'పచ్చ' జెండా ఊపడంతో మద్యం షాపుల యజమానులు ఇక తమ జేబులను నింపుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. అయితే జాతీయ ఎక్సైజ్ విధానానికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవడంపై చంద్రబాబు ప్రభుత్వంపై పలు విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

కాకినాడ జిల్లాలో 155 ప్రైవేటు మద్యం దుకాణాలు, 20 బార్లు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 169 షాపులు, 10 బార్లు, తూర్పు గోదావరి జిల్లాలో 154 దుకాణాలు, 19 బార్లు ఉన్నాయి. అలాగే మండలానికి ఒకటి చొప్పున బిసి కులాలకు ప్రత్యేకంగా కేటాయించిన షాపులు అందుబాటులోకి వచ్చాయి. ఇలా పలుచోట్ల గతం కంటే లైసెన్స్ మద్యం షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. గత వైసిపి సర్కార్ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం షాపులను నడిపింది. అయితే నాసిరకం బ్రాండ్లను విక్రయాలు జరిపి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడిందనే తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు నాసిరకం బ్రాండ్లను ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయించుకుని వందల కోట్లు ప్రజల సొమ్మును లూటీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు చంద్రబాబు నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తామంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. మద్యపాన నిషేధాన్ని పక్కనపెట్టి ప్రైవేటు వ్యక్తులు విక్రయాలు జరుపుకునేలా అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో లైసెన్సులు పొందిన వారిలో 80 శాతానికి పైగా కూటమి పార్టీలకు చెందిన నేతలే ఉండడం గమనార్హం.

ఆదాయమే పరమావధిగా...

ప్రభుత్వం మద్యం అమ్మకాల ద్వారా భారీగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. దీనిలో భాగంగానే లైసెన్సులు పొందేందుకు లాటరీ పద్ధతిని నిర్వహించింది. లాటరీలో పాల్గొన్నవారు ఒక్కొక్కరు రూ.2 లక్షలు చెల్లించాలని నిబంధన విధించింది. ఈ ప్రక్రియలో తొలి దశలోనే ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మరోవైపు ఒక్కో లైసెన్స్ దుకాణానికి ఏడాదికి రూ. 65 లక్షలు కిస్తీ సొమ్మును వసూలు చేస్తోంది. ఏడాది మొత్తంలో ఈ సొమ్ము చెల్లించాల్సి ఉండగా ఏడు విడతల వ్యవధిలో ప్రభుత్వం లైసెన్స్ మద్యం యజమానుల నుంచి కిస్తీ సొమ్మును రాబట్టుకుంది. ప్రస్తుతం పర్మిట్ రూములకు ఒక్కొక్క షాపు నుంచి రూ.5 లక్షల వసూలు చేయనుంది. షాపు పక్కనే మద్యం తాగేందుకు గదిని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తారు. అక్కడ కుర్చీలు, బల్లలు వేసుకుని తాగేందుకు అవకాశమిస్తారు. షాపు లైసెన్సీ వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, స్నాక్స్ లాంటివి విక్రయించుకోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. పర్మిట్ రూమ్‌ల వల్ల మద్యం విక్రయాలు మరింత పెరుగుతాయి. దీంతో ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరడంతో పాటు వ్యాపారుల జేబులు నింపుకోవచ్చు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల కొలది బెల్ట్ షాపుల్లో విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

చిన్న చిన్న గ్రామాల్లో సైతం 5 నుంచి 8 వరకూ బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే ప్రతీ 10 బడ్డీ దుకాణాల్లో 6 షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. మరోవైపు లైసెన్సు దుకాణదారులు సైతం సిండికేట్లుగా ఏర్పడి అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో బాటిల్ పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. అలాగే పర్మిట్ రూములకు అనుమతులు లేకపోయినప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారుల అండదండలతో ఇప్పటికే లైసెన్స్ దుకాణదారులు పర్మిట్ రూములు మాదిరిగానే మద్యం దుకాణాల వద్ద విచ్చలవిడిగా మందుబాబులు మద్యం సేవించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. మామూళ్లను సమర్పించుకుంటున్న వ్యాపారులు తమ పని కానిచ్చేస్తున్నారనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. మరోవైపు సమయపాలన కూడా పాటించడం లేదనే ఫిర్యాదులు ఎక్సైజ్ శాఖ అధికారులకు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం అమ్మకాలను నియంత్రించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

జాబ్ మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

జాబ్ మేళాలపై ప్రత్యేక దృష్టి అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలపై నిరుద్యోగ యువత ప్రత్యేక దృష్టి సారించడం అవసరమని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. గురువారం వికాస ఆధ్వర్యంలో స్థానిక ఐడియల్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాను విజయవంతం చేసేందుకు గత వారం రోజులుగా ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు బృందం జాబ్‌మేళా నిర్వహణకు అహర్నిశలు శ్రమించారన్నారు. వికాస బృందం, ఇతర ప్రజాప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు. అనేక వ్యయ ప్రయాసలతో జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగం అవసరం ఉండి ఆసక్తి ఉన్నవారే ఈ జాబ్ మేళాలలకు హాజరు కావాలన్నారు. కేవలం టైం పాస్ కోసమో, సరదా కోసమో కాకుండా, నిజంగా ఉద్యోగం చేయాలనే ఆసక్తి, అవసరం ఉన్నవారు మాత్రమే జాబ్ మేళాలకు రావాలని ఆయన కోరారు. హైదరాబాదు, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగం వస్తే వెళ్ళడానికి సిద్ధంగా లేని వారు, కేవలం ఇంటర్వ్యూ అనుభవం కోసం వచ్చి ఇతరుల అవకాశాలను దెబ్బతీయవద్దని ఆయన సూచించారు. అనవసరంగా సంఖ్యను పెంచి, జాయిన్ కాని వారి వల్ల కంపెనీల సమయం, నిర్వాహకుల శ్రమ వృధా అవుతుందన్నారు. ఇది తమ తోటి స్నేహితులు, కొలీగ్స్ భవిష్యత్తుకు సంబంధించిన విషయమని అభ్యర్థులు గుర్తించాలన్నారు. ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక జాబ్ మేళాలు నిర్వహించడం జరిగిందన్నారు. వికాస సంస్థ ద్వారా సుమారు 1.50 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. వికాస పీడీ కె.లచ్చారావు మాట్లాడుతూ ప్రస్తుత జాబ్ మేళాకు 35 కంపెనీల ప్రతినిధులు హాజరవ్వడం జరిగిందన్నారు. 1200 ఉద్యోగాల కొరకు నిర్వహించిన ఈ జాబ్ మేళాలు 1150 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారని తెలిపారు. వివిధ కంపెనీలకు ఎంపికైన 648 అభ్యర్థులకు ఎంఎల్‌ఎ కొండబాబు, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ చేతుల మీదుగా నియమక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐడిఎల్ కళాశాల ప్రిన్సిపల్ టి.సత్యనారాయణ, కరస్పాండెంట్ పిఎస్-ఎస్.కిరణ్, డైరెక్టర్ ఎం.రంజిత్, వికాస సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి - కిర్లంపూడి

భూపాలపట్నం సచివాలయంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సర్పంచ్, టిడిపి మండల అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు ఘనంగా సత్కరించారు. గురువారం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు సచివాలయంలో విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. అనంతరం సర్పంచ్, వార్డ్ మెంబర్లు బదిలీ అయిన ఉద్యోగులను శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు.

బదిలీ అయిన సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్

మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జెఎసి నాయకులు

సెప్టెంబర్ 1న సిపిఎస్ ఉద్యోగుల మహాసభ

-విజయవంతం చేయాలిన ఉద్యోగుల జెఎసి పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

పెన్షన్ విద్రోహ దినంగా సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో జరగబోయే సిపిఎస్ ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్య కార్యాచరణ వేదిక పిలుపునిచ్చింది. ఎపిసిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కెవి.బాషా అధ్యక్షతన స్థానిక ఎపిఎన్‌జిఒ కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ 2004 సంవత్సరం సెప్టెంబర్ 1 నుంచి నూతన పెన్షన్ విధానం అమలులోకి వచ్చిందన్నారు. ఆ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరణ చేయాలని గత కొన్నేళ్లు గా ఉద్యమాలు సాగిస్తూ ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ సాధించుకున్న ఉద్యోగులు తమకు పాత పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వ హయాంలో మోసపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సిపిఎస్.విధానం మీద రివ్యూ చేసి ఉద్యోగులకు మేలు చేసే విధానాన్ని తీసుకొస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఐక్య వేదిక డిమాండ్ చేసింది. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం వేసే నెలవారీ కాంట్రిబ్యూషన్‌ను ఈ ప్రభుత్వం బకాయిలు లేకుండా ప్రతీ నెలా చెల్లిస్తూ ఉండడం పట్ల ఐక్య వేదిక ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఆలోచించే కూటమి ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తెచ్చి ఉద్యోగులకు భరోసా ఇవ్వాలని కోరారు. సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మహాసభ ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్. మొండి రవికుమార్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు చింతా నారాయణమూర్తి, అలీం, జిల్లా సభ్యులు మోకా పద్మ, సరితా దేవి, పసుపులేటి శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరరావు, పి.వెంకట కృష్ణ, మూర్తిబాబు, సిహెచ్.ప్రదీప్‌కుమార్, కె.విశ్వనాథం, ఎం.శ్రీనివాస్, సిఎచ్.శ్రీనివాస్, బొజ్జ శరత్, చార్లెస్ పాల్, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చేనేతకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

పెద్దాపురం స్థానిక ముప్పన రామారావు వీవర్స్ కమ్యూనిటీ భవనంలో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి పాల్గొని మాట్లాడారు. పెద్దాపురం సిల్కుకు జాతీయస్థాయిలో అవార్డు రావడం, ఆ అవార్డును తన చేతుల మీదుగా తీసుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు మాట్లాడారు. 50 మంది ఉప్పాడ చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున రూ.కోటి ముద్ర రుణాల చెక్కులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి డైరెక్టర్ జయకృష్ణ, రంది సత్యనారాయణ, పోలమరశెట్టి సత్తిబాబు, కొత్త వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు **యు.కొత్తపల్లి** మండలంలోని మూలపేట గ్రామంలో చేనేత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మూలపేట రామాలయం నుండి సచివాలయం వరకు చేనేత కార్మికులు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని, చేనేత పరిశ్రమ నిర్వీర్యం అయిపోతుందని కార్మికుల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధి నాగేశ్వరరావు, మురళి, బాబ్జి, సత్యనారాయణ, సత్తిబాబు, గుంటుకు సత్తిబాబు పాల్గొన్నారు. **కాజులూరు** కాజులూరులో జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుమల్ల సహకార సంఘం అధ్యక్షులు కొల్లు వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికుల సంఘం అధ్యక్షులు కుసున్నరి రామకృష్ణ, బొడ్డు వీరకృష్ణ, బండారు సత్యనారాయణ, కవితరపు గోవిందు, గోపి సత్తిబాబు, గోపి పిల్లా రాయుడు, లొల్ల గిరి, లొల్ల వెంకటరమణ పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలోని తాటిపర్తి గ్రామంలో పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తగినంత సహకారం ఉండటం లేదన్నారు. బడ్జెట్‌లో కోతలు విధించడం రాయతీలు ఎత్తివేయడం వల్ల చేనేతకారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగంపై విధించిన జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నగంటి సత్యనారాయణ, నాయకులు శీరం లక్ష్మణప్రసాద్, తెడ్లపు నాగేంద్ర, పడాల అప్పారావు, శ్రీను పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** రమణయ్యపేట అడబాల ట్రస్ట్, కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు, కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుడు రాశాబత్తుని బాలాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవల్లి, అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, ప్రసాద్ నాయుడు, ఎస్ శ్రీ నగేష్ పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం కన్వీనర్ వీరభద్రరావు, శివ ప్రసాద్, లక్ష్మీ కుమారి, మేరీ రోజాలీన పాల్గొన్నారు.

గొల్లప్రోలులో అభివాదం చేస్తున్న ఫ్రంట్ నాయకులు

పెద్దాపురంలో ముద్ర లోన్ చెక్కును అందిస్తున్న కలెక్టర్

దూబగుంట రోశమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి - పిఠాపురం

సారా వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుట్టిన దూబగుంట రోశమ్మ వర్ధంతిని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం మండలంలోని మంగితుర్తి గ్రామంలో దూబగుంట రోశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ మండల కన్వీనర్ వనపర్తి సూర్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా సెక్రెటరీ కె.సింహాచలం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డెక్కల లాజరు, సిమ్మ, శ్రీలక్ష్మి, పెంకె వనుగులమ్మ, నూకరాజు, లక్ష్మి, పోలవరపు రత్నం, కుమారి పాల్గొన్నారు. అలాగే గోకివాడలో రోశమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్యం మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు వేమగిరి తలుపులియ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు కొమ్ము చిన్నబాబు, స్థానికులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మహిళలు

'ఎక్సలెన్స్'లో ఆదిత్యకు 3వ స్థానం

ప్రజాశక్తి - గండేపల్లి

అవార్డును తీసుకుంటున్న ఆదిత్య ప్రతినిధి నీలిమ

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో ఆదిత్య విశ్వవిద్యాలయం 3వ స్థానంలో నిలిచిందని ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ బంజారా హిల్స్ రాడిసన్‌లో జరిగిన కేంబ్రిడ్జ్ సమన్వయకర్తల వార్షిక సమావేశంలో ఈ అవార్డును ఆదిత్య యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ తెలుగు నీలిమ అందుకున్నారని తెలిపారు. ఆ సమావేశంలో డాక్టర్ నీలిమ ఇచ్చిన ప్రజెంటేషన్‌ను నిర్వాహకులు అభినందించారని, ఈ గౌరవాన్ని అందుకున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. ఆదిత్యకు ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో 3వ స్థానాన్ని పొందడం పట్ల ఛాన్సలర్. డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్, రిజిస్ట్రార్, వివిధ విభాగాల డీన్‌లు ఆనందం వ్యక్తం చేశారు.

347 మందికి రక్త పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

బోధవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెలలో 347 మందికి రక్త పరీక్షలు నిర్వహించామని జాతీయ బోధ వ్యాధి నివారణ కేంద్రం హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఐ.సువర్ణరాజు అన్నారు. గురువారం ఆయన గోదావరి నివారణ కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. ప్రతి నెల నిర్వహించే రక్త నమూనాల సేకరణ కార్యక్రమంలో స్థానిక రామారావుపేట, వరహాలయ్యపేటలలో 347 మందికి రక్త నమోనాలు సేకరించి పరీక్షలకు పంపించగా వీరిలో ఒక్కరికి బోధ వ్యాధి నిర్ధారణ కాలేదన్నారు. ప్రతి గురువారం పెద్దాపురం బోధ నివారణ కేంద్రం పరిధిలోని గ్రామాలకు సంబంధించి గతంలో బోధవ్యాధికి గురైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు.

డీ-వార్మింగ్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

డీ వార్మింగ్ మాత్రలైన ఆల్బెండజోల్ మాత్రలను సిబ్బందికి పంపిణీ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఇఒ కెహెచ్.నాయక్ ఎంపిడిఒ చంద్రరావు వైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో నేషనల్ డే వార్నింగ్ డే పోస్టర్‌ను ఎంపిపి చలగల దొరబాబు ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12న మాత్రలను సిబ్బంది మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు మధ్యాహ్నం భోజనం తర్వాత వేయడం జరుగుతుందని తెలిపారు.

కార్టూన్ 'నిజం'



తాగునీరు ఇలా... తాగేదెలా..?

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు గురువారం ఆకు పసరు రంగులో వచ్చింది. బ్రౌన్ పేట, కుమ్మర వీధి కొత్తపేట, 6వ వార్డు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ఆకు పసరు రంగులోనే నీరు సరఫరా అవుతోంది. ఇలాంటి నీటిని ఎలా తాగాలని, ఈ నీటితో వంట, స్నానాలు ఎలా చేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజులుగా ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కారణాలు పరిశీలిస్తున్నాం

కుళాయిల్లో ఆకు పసరు రంగులో నీరు రావడానికి గల కారణాలను పరిశీలిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య అన్నారు. స్థానిక బడేలమ్మ చెరువులో చేపల వేట కోసం నీటిని మోటారు సహాయంతో బయటకు పంపిస్తుండగా ఆ జలాలు పైపులైన్ల లీకుల ద్వారా కుళాయిల్లోకి వస్తున్నట్టు అనుమానంతో తమ సిబ్బందితో లీకులు గుర్తించే చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. బడేలమ్మ చెరువులో జలాలు బాగా ఆకు పసరుగా ఉన్నందున అవే కలుషితం అయ్యే అవకాశం ఉన్నట్టు ఆమె చెప్పారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు ఈ పరిస్థితి లేదని, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సమస్య ఉన్నందున పరిస్థితి చక్కదిద్దనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం బడేలమ్మ చెరువులో నీటిని బయటకు పంపింగ్ చేసే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపి వేసినట్టు ఆమె తెలిపారు.

కుళాయిల నుంచి పసరు రంగులో వస్తున్న నీరు

పైపు జాయింట్ వద్ద కలుస్తున్న పసరు నీరు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం మండలంలోని శాంతి ఆశ్రమం వద్ద రూ.3.06 కోట్ల వ్యయంతో నిర్మించే విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఎంఎల్‌ఎ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక సదుపాయాలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, కొమ్ముల కన్నబాబు, బద్ది రామారావు, ఎలక్ట్రికల్ ఎఇ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - దేవరపల్లి

గొల్లగూడెం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. విశాఖ పోర్ట్ నుంచి జిప్సం లోడుతో వరంగల్ వెళుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఆదుపుతప్పి కరెంటు స్తంభం కి కొట్టి చెరువులోకి దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తాడికొర్ల శివ నాగ ప్రసాద్(45) మృతి శరీరం నుంచి కాళ్లు చేతులు తల వేరుగా ఎగిరి పడ్డాయి. దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటన ప్రదేశాన్ని చేరుకొని పరిశీలించారు

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని బావాజీపేట గ్రామం పుష్కర కాలువ వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కామరాజు పేటకు చెందిన పందారి షణ్ముఖ్, అతని భార్య వీరలక్ష్మి, ఏడేళ్ల కుమార్తె పుష్పవల్లి, నాలుగేళ్ల కుమారుడు తేజ బైకుపై గోకవరంవైపు ప్రయాణిస్తున్నారు. వారు బావాజీపేట పుష్కరకాలువ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా గ్యాస్ ట్యాంకర్ వీరి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పందారి పుష్పవల్లి(7) మృతి చెందింది. కుమారుడు తేజ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. లారీ ట్యాంకర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని గోకవరం ఎస్ఐ తెలిపారు.

సీజ్ చేసిన బియ్యం వ్యాన్‌లతో డిఎస్‌పి, ఎంఎస్‌ఒలు

29 టన్నుల పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో పిడిఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. రెండు వేర్వేరు ప్రదేశాల్లో మూడు వ్యాన్లలో తరలిస్తుండగా పట్టుకుని సుమారు 29 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణరాజు, ఏలేశ్వరం, ప్రత్తిపాడు సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్లు రవి, నాగబాబులతో కలిసి గురువారం తెల్లవారుజామున జాతీయ రహదారిలో మాటు వేశారు. ఈ నేపథ్యంలో రామవరం వైపు వెళ్తున్న రెండు వ్యాన్లను, జెవిఆర్ జంక్షన్ నుంచి వెళ్తున్న మరో వ్యాన్‌ను తనిఖీలు చేశారు. ఈ మూడు వ్యాన్లలో కలిపి 29 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించినట్లు సత్యనారాయణరాజు వెల్లడించారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మండల స్టాక్ పాయింట్‌కు తరలించామని, సంబంధిత బియ్యం యజమానులపై 6ఎ కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యాన్‌లను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

కుటుంబీకులకు మహిళ అప్పగింత

ప్రజాశక్తి - గండేపల్లి

అదృశ్యమైన అవివాహితను గుర్తించి ఆమె కుటుంబీకులకు పోలీసులు గురువారం అప్పగించారు. మండలంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన ఒక అవివాహిత ఈ నెల ఒకటో తేదీన అదృశ్యమైంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సిఐ వై.ఆర్.కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ శివనాగ్, సిబ్బంది వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి ఆమె హైదరాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ ఏరియాలో ఉన్నట్లు గుర్తించారు. ఆమెను గురువారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు.

యువకునిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల గ్రామానికి చెందిన ఐడి.ప్రసాద్ అనే యువకుడిపై గురువారం పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. జె.కొత్తూరు గ్రామానికి చెందిన అనామిక అనే ఆమెను వేధిస్తూ, మెసేజ్‌లు పంపుతున్న ప్రసాద్‌పై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రఘునాథరావు కేసు దర్యాప్తు చేసి అతన్ని అరెస్ట్ చేశారు. సత్ప్రవర్తన కోసం తహశీల్దార్ జవిఆర్.రమేష్ వద్ద బాండ్ ఓవర్ చేశారు. ఎవరైనా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు..

పాలకమండలి నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ నియామకానికి దేవాదయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ గురువారం విడుదల చేసింది. గతంలో ఈఓ హోదా కలిగిన ఈ ఆలయం దినదిన అభివృద్ధి చెందడంతో పాటు ఏడాది ఆదాయం రూ.30 కోట్ల పైనే ఆదాయం వస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆలయానికి డిప్యూటీ కమిషనర్ హోదా కలిగిన అధికారిని నియమించడంతో 17 మంది సభ్యులతో పాలకమండలి ఏర్పాటుకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 17 మందిలో ఏడుగురు మహిళలకు పాలకమండలి సభ్యులుగా పదవులు దక్కనున్నాయి.

మిడ్డే మీల్స్ పథకం పరిశీలన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఇఒ కె.తాతారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంటశాలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతోనే సంఘం అభివృద్ధి

సభలో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఐకమత్యంతోనే సంఘ అభివృద్ధి సాధ్యమని పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక బొడ్డు సత్యనారాయణ కల్యాణమండపం ఆవరణలో పొన్నమండ లక్ష్మణ స్వామి వర్య 156వ జయంతిని నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం జిల్లా అధ్యక్షులు వైరాడి సూరరాజు, సంఘ సేవకులు బొడ్డు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్నికుల క్షత్రియులకు గుర్తింపు తెచ్చిన మహోన్నత ఆదర్శమూర్తి పొన్నమండ లక్ష్మణ స్వామివర్య అని కొనియాడారు. అగ్నికుల క్షత్రియులకు ప్రభుత్వపరంగా గుర్తింపు తెచ్చా రని అన్నారు. లక్ష్మణస్వామి వర్య విగ్రహంతో పాటు, విద్యాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలంతోపాటు, విగ్రహాలు, భవన నిర్మాణానికి ముందుకొచ్చిన బొడ్డు సత్యనారాయణను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వైరాడి సూరరాజు, దండుప్రోలు నాగబాబు, మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహరాజు, కామాడి మాతరాజు, కాటం సత్తిరాజు, పాలెపు ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు ఇచ్చిన వ్యక్తినే విమర్శిస్తారా'

విలేకరులతో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట

మాజీ మంత్రి, వైసిపి నేత తోట నరసింహం ద్వారా గుర్తింపు పొంది ఆయననే విమర్శిస్తారా అని వైసిపి మండల ఉపాధ్యక్షులు వానాసి సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మల్లిశాలకు చెందిన అత్తులూరి సాయిబాబు మాజీ మంత్రి జ్యోతుల పూలే జయంతి వేడుకల్లో తోట నరసింహంను విమర్శించడం దారుణమన్నారు. కార్యకర్తలను పట్టించుకోవట్లేదని ఆనాడు పిసిసి మెంబర్ పదవి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. రెండు నాలుకల ధోరణితో మాట్లాడటం మంచిది కాదన్నారు. నరసింహంపై ఇటువంటి వ్యాఖ్యలు చేసిన మీరు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లె ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై ఎరువుల పంపిణీ

రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు గ్రామంలో రైతులకు రాయితీపై ఎరువులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి ఎన్‌విఎ.ప్రసాద్ మాట్లాడుతూ మండల పరిధిలో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. పొలాలకు అవసరమైన ఎరువులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కట్టమూరులో ఆర్‌ఎస్‌కెకు రైతులు ఒక్కసారిగా రావడంతో ఇబ్బందులు వచ్చాయన్నారు. ప్రస్తుతం రైతులందరికీ క్రమ పద్ధతిలో ఎరువులు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం వరి చేలకు ఎకరానికి 30 కేజీల యూరియా సరిపోతుం దన్నారు. కానీ రైతులు ఎకరానికి 45 కేజీలు యూరియా వినియోగిస్తున్నారన్నారు. దీనివల్ల పంటకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. రూ.3 వేల విలువైన యూరియాను రాష్ట్ర ప్రభుత్వం రూ.275కే అందజేస్తుందన్నారు.

ఉల్లాస్‌తో మెరుగైన ఉపాధి: మెప్మా పీడీ

వివరాలు తెలుసుకుంటున్న డ్వామా పీడీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

నిరక్షరాస్యులుగా ఉన్న ఉపాధి కూలీలను అక్షరాస్యులుగా చేసేందుకే ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, తద్వారా ఉపాధి మెరుగుపడుతుందని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ మండల స్థాయి సభ ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన జరిగింది. గత వారం రోజులుగా వివిధ గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించిన వివరాలను డిస్ట్రిక్ రిసోర్స్‌పర్సన్ సభలో వివరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధి చట్టం ద్వారా రూ.7,06,22,668 విలువైన 1466 పనులు చేసినట్లు తెలిపారు. రూ.6,80,09,684 వేతనాలుగానూ, రూ.26,12,984 మెటీరి యల్‌కు ఖర్చు చేశామన్నారు. మొత్తంగా మండలంలో వివిధ శాఖల ద్వారా రూ.13,16,03,112 నిధులతో జరిగిన 1516 పనులపై సామాజిక తనిఖీలు చేయడం జరిగిందన్నారు. గతంతో పోలిస్తే ఉపాధి హామీ పథకం అమలు సంతృప్తికరంగా ఉందన్నారు. చిన్నచిన్న లోపాలను గుర్తించి వాటిని సరి చేసుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు. పని ప్రదేశంలో పనికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని, కాలువ పనులు చేసేటప్పుడు కొలతల్లో జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు.

విద్యార్థిని ఆత్మహత్య బాధాకరం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం విద్యార్థిని కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య అత్యంత బాధాకరం అని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పిసిసి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కొండా వెంకటేశ్వర్రావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహ పూర్వకంగా మెలగాలని వెంకటేశ్వర్రావు సూచించారు. ఇటీవల రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై చాలా ఆత్మహత్యలు జరుగుతున్నాయని, వారి ఆత్మహత్యలు కలిసొస్తున్నాయని అన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు మార్కుల కోసం, ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేయకూడదన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నిలువునా దోపిడీ చేస్తున్నటువంటి కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల ఆరోగ్య మానసిక పరిస్థితులు ఎక్కడ పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఒకే క్లాసులో 100 మంది పైగా కుక్కి చాలీచాలని ప్రాథమిక సదుపాయాలు చెప్పించి మార్కులు రావాలని ఒత్తిడి చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. విద్యార్థిని మరణానికి కారణమైనటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి కళాశాల యాజమాన్యం నుంచి ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

బాబు ష్యూరిటీ ...మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలం వెంకటాయపాలెంలో గ్రామంలో సర్పంచ్ ఎలమంచిలి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామచంద్రపురం వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్న ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను సిఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పోలిశెట్టి వరప్రసాద్, ఎంపిపి అంబటి భవాని, జిల్లా ఎపి బిసి డైరెక్టర్ శ్యామ్, బోణం శ్రీను దడాల రవికుమార్, గ్రామ పెద్దలు అనుసూరి వెంకటరమణ, గండం పుల్లయ్య కాపు మాజీ మార్కెట్ డైరెక్టర్ సం దరపల్లి వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

కాకినాడ రూరల్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కిర్లంపూడి మండలంలోని గెద్దనాపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఒ పూర్ణిమ పాల్గొని తల్లి పాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే చిల్లంగిలో సెక్టార్ సూపర్‌వైజర్ భూవమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సాధన, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట లయన్స్ క్లబ్ మల్టిపుల్ సర్వీసెస్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కె.ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. డాక్టర్ ప్రియాంకను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షులు బి. ప్రసాదనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఓం నమశ్శివాయ, నాగిని, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, డాక్టర్ శిరీష, చింతపల్లి సుబ్బారావు, ఎస్ శ్రీ సగేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. సామర్లకోట స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ జి.ఉష తల్లిపాల ప్రయోజనంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎండి సుల్తాన్ బీబీ, ఎన్.ఉమాదేవి, నిర్మలకుమారి, నళిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత మత్స్యకార కుటుంబాలకు సాయం

నగదు, నిత్యవసరాలను అందిస్తున్న ఎంఎల్‌ఏ కొండబాబు

ప్రజాశక్తి - కాకినాడ

శ్రీలంక సముద్రజలాల్లో నగరానికి చెందిన నలుగురు మత్స్యకారులు పట్టుబడ్డారు. కుటుంబ యజమానులు శ్రీలంకలో ఉండటంతో వారి కుటుంబాలకు ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు గురువారం ఆర్థిక సాయంతోపాటు, నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి చెందిన పంతాడి బ్రహ్మానందం రూ.40 లక్షలతో కేరళలో ఫిషింగ్ ఫైబర్ బోటును కొనుగోలు చేశారని, ఆ బోటును రామేశ్వరం మీదుగా కాకినాడకు తీసుకొచ్చే సమయంలో జిపిఎస్ పరికరం సాంకేతిక లోపంతో ఆగస్టు 4వ తేదీన బోటు శ్రీలంక సముద్ర జలాల్లో ప్రవేశించిందన్నారు. దీంతో శ్రీలంక కోస్ట్ గార్డ్ సిబ్బంది ఫైబర్ బోటును, బోటులో ఉన్న మత్స్యకారులు పంతాడి బ్రహ్మానందం, చింతా నాగేశ్వరరావు, కర్రి సూరరాజు, కొప్పడి శ్రీనులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వెంటనే ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. శ్రీలంక అధికారులతో సంప్రదింపులు జరపడం జరిగిందన్నారు. మత్స్యకారులను త్వరలోనే సురక్షితంగా కాకినాడకు తీసుకురావడం జరుగుతుందన్నారు. మత్స్యకారుల కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయంతోపాటు, నిత్యవసర సరుకులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.కృష్ణారావు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.కరుణాకర్, ఎఫ్‌డిఒ జి. గోపి, కె.ప్రశాస్, బోటు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బలసాడి రంగారావు, సంఘాని నాగేశ్వరరావు, మల్లాడి రాజు పాల్గొన్నారు.

ప్రయోగాలపై విద్యార్థులకు శిక్షణ

ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటీ సైన్స్ సెంటర్‌లో గురువారం శ్రీవిద్యానిధి పాఠశాలకు చెందిన 10 వ తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పాఠ్యాంశాల పై ప్రయోగాల ద్వారా అవగాహన కల్పించారు. జంతు ప్రేమికుడు నవీన్ నాని విద్యార్థులకు వివిధ జంతువుల జీవన విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధ శ్రీనివాస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో హెచ్‌ఎం సాయిరామకృష్ణ

ఆటల పోటీల నిర్వహణ

ప్రజాశక్తి - సామర్లకోట

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. అలాగే ఖో ఖో, కబడ్డీ, లాంగ్ జంప్, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని హెచ్‌ఎం తెలిపారు. ఆయా పోటీలను ఉపాధ్యాయులు కె.గంగాభవాని, ఎస్.హరినాథ్, పి.సుధారాణి, పి.బ్రహ్మానందం, పి.నిర్మల నిర్వహించారు.

వినూత్నంగా మొండి బకాయిల వసూలు

ప్రజాశక్తి - గండేపల్లి

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు గండేపల్లి బ్రాంచ్ అధికారులు వినూత్న రీతిలో మొండి బకాయిలు వసూలుకు శ్రీకారం చుట్టారు. గురువారం ఉప్పలపాడు పిఎసిఎస్‌లో ఉన్న మొండి బకాయిలను వసూలు చేసేందుకు ష్యూరిటీదారుల ఇంటిటికి తిరిగి వసూళ్ళు చేపట్టారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ష్యూరిటీదారులను అడిగి వసూలు చేయడం జరుగుతుందని బ్రాంచ్ మేనేజర్ రాజాకృష్ణ తెలిపారు. మొండి బకాయిలు వసూలుకు బ్రాంచ్ ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్య క్రమంలో ఎజిఎం డి.యేసురాజు, నోడల్ ఆఫీసర్ వి.రమణమూర్తి, సూపర్‌వైజర్ బాలకృష్ణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - సామర్లకోట

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటం అందరి బాధ్యతగా తీసుకోవాలని రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ పిలుపునిచ్చారు. గురువారం రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ అభియాన్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించే స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంపై ఆయన పలు సూచనలు చేశారు. రైల్వే స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ని అన్ని కార్యాలయాలు, ఆసుపత్రి, క్వార్టర్లలో స్వచ్ఛ అభియాన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలి

ప్రజాశక్తి - రాజోలు

నేటి విద్యా సమాజంలో ప్రతీ విద్యార్థి భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని వన్ మిలియన్ వన్ బిలియన్ సంస్థ అమెరికా నిపుణుడు కృతిక్ అన్నారు. మలికిపురం ఎంవిఎన్‌, జెఎస్ అండ్ ఆర్‌విఆర్, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.ఆనంద మహిమ అధ్యక్షతన గురువారం జరిగిన ఉద్యోగ సంసిద్ధత అవగాహన సదస్సు లో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రంగానికి సంబంధించినా ఏ సంస్థలో ఉద్యోగం కావాలన్నా భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ముఖ్యమన్నారు. ఆ స్కిల్స్ ఆంగ్ల భాషా ప్రావీణ్యం రెండూ ఒకటి కాదు రెండింటికీ తేడా ఉందన్నారు. చాలా మందికి ఆంగ్లంపై పట్టు ఉన్నప్పటికీ వారు చెప్పాలనుకున్నది సరిగ్గా చెప్పలేక పోవచ్చన్నారు. ఇది ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్లనో, చెప్పాలనుకున్నది సరిగ్గా వ్యక్త పరచలేకపోవడం వల్లనో జరుగుతూ ఉంటుందన్నారు. ఇలాంటి ఇబ్బందులను అధిగమించ డానికి ఈ కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఆంగ్ల భాషపై ప్రావీణ్యం మెరుగుపరచుకోవాల్సి ఉంటుందన్నారు. ఆయా పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. తర్వాత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి ఎంత మంది ప్రస్తుతం ఉద్యోగాలకు అనుగుణంగా ఎదే నైపుణ్యాలు సిద్ధంగా ఉన్నారో సర్వే చేపట్టారు. తర్వాత విద్యార్థులకు రెస్యూమ్ బిల్డింగ్, డిజిటల్ సిటిజన్ షిప్, ఉద్యోగాల్లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, ఇంటర్వ్యూ నిపుణత, ప్రాథమిక ప్రవర్తనలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే ఐబిఎమ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 1000 ఆన్‌లైన్ కోర్సులకు ఆక్సిస్ అంద జేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ అభిరామ్, జిల్లా కోఆర్డినేటర్ సాగర్, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ చిట్టల సత్యనారాయణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 5 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు: కాకినాడ
E.P.No.60/2023; O.S.No.835/2022
Between: చిట్టూరి రవీంద్ర ...డిక్రీహోల్డర్
మరియు
మసకల సరసింహారావు ...జడ్జిమెంట్ డెట్టర్
DHr యేలంపాట వేలం ప్రకటన
పై కోర్టు వారి ఆర్డర్ ప్రకారం ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని పై కోర్టు వారి యెదుట ది.22-08-2025వ తేదీన ఉదయం గం.10.30 ని.ల లగాయతు కోర్టు బహిరంగ ప్రకారం వేలం వేయబడును. ...
షెడ్యూల్: పూర్వపు తూర్పుగోదావరి జిల్లా ... కాకినాడ రూరల్ మండలం, సర్పవరం గ్రామ పంచాయితీ, ...
DHr Value : Rs. 14,00,000/-
Amina Value : Rs. 40,00,000/-
JDr Value : Not Given
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో
I.P.No.14/2022
Between:-
1) Alanka Gowri Maheswara Rao, S/o Pothuraju, Hindu, Age 65,D.No. 9-1-25/9/109, N.T.R.Marg, Amalapuram, D.B.R.A. Konaseema Dist ...Petitioner
And
Konathala Venkata Murali and Others ...Respondents
2) Boddada Padma Krishna, S/o Not Known, Hindu, Age 49, Business, D. No. 12-4-85/2, Near Vivekananda Hospital, Opp. Yamani Hospital, Anakapalli (P.o), Vizag District.
8) Arjilli Das, S/o. Nuka Raju, Hindu, Age 43, Business, D.No. 14-21-78, RH Colony, Gangavaram, Bala Cheruvu Road, Peda Gantyada, Gajuvaka, Vizag District.
20) Banna Rama, W/o Not Known, Hindu, Age 43, House Wife, D.No.3-45/2, Muchavani Peta, Fazulbag Peta, Srikakulam, Srikakulam District.
పై నెంబర్ ఐ.పి.14/2022 పిటీషన్ తనను Insolvent గా డిక్లేర్ చేయమని దాఖలు చేసిన పిటీషన్‌లో 2,8 మరియు 20 రెస్పాండెంట్లకు నోటీసులు పేపర్ ప్రకటన ద్వారా అందుటకు గాను ది.26-08-2025వ తేదీ వాయిదా అయి ఉన్నది. ...
V.R.Vidya sankaram
Advocate
Amalapuram Amalapuram
05-08-2025 Cell. 9849293793

IN THE COURT OF THE IV ADDITIONAL JUDICIAL FIRST CLASS MAGISTRATE: KAKINADA
FDP No.3 of 2024
in O.S.No.692/2019
Between :-
Smt. UNGARALA KUMARI, W/o.Kasi Eswara Rao, Age 40 years, D.No.52-9-5, Chikkalavari Street, Jagannadhapuram, Kakinada. ...Petitioner/Plaintiff
and
R1) Pasupuleti Maha Lakshmi, W/o. Late Pasupuleti Babji, Age 40 years, D.No.58-1-49, Chinna Market Veedhi, J.Ramaraopeta, Kakinada.
R2) Pasupuleti Nagendra, S/o. Late Pasupuleti Babji, Age 20 years, D.No.58-1-49, Chinna Market Veedhi, J.Ramaraopeta, Kakinada. ...Respondents/Defendants
పై నెంబర్ FDP No.3 of 2024 in O.S.No.692/2019 లో కోర్టు వారి ఆర్డర్ ప్రకారం R2/2వ ప్రతివాది అయిన Pasupuleti Nagendra గారికి ... ది.21-08-2025వ తేదీ ఉదయం 10.30 నిమిషములకు ...
వక్కలంక సత్యనారాయణమూర్తి M(T).రాజశ్రీ. T.S. రత్నకర్, అడ్వకేట్
కాకినాడ. డో.నెం. 7-9-29, సాంబమూర్తి వీధి, రామారావుపేట, కాకినాడ సెల్: 9849012112

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
E.A.No.143/2025 E.P.No.33/2023 in O.S.No.750/2011
Between:-
Gangisetti Vijaya Veera Venkata Surya Satyanarayana@Chantibabu ...Petitioner/DHR
And
Eeda@veedhi Kanaka Durga Prasad(died) and Others ...JDRs
JDR2. Veedhi Visalakshi, W/o.Late Kanaka Durga Prasad, Hindu, aged 54 years, House Wife, D.No.23-18-167, 3 street, Lalithanagar, Ward No 12, Rajahmundry.
JDR3. Veedhi Sudhakar, S/o. Late Kanaka Durga Prasad, Hindu, aged 34 years, D.No.23-18-167, 3 street, Lalithanagar, Ward No 12, Rajahmundry.
JDR4. Veedhi Jitendra, S/o. Late Kanaka Durga Prasad, Hindu, aged 32years, D.No.23-18-167, 3d street, Lalithanagar, Ward No 12, Rajahmundry.
పై నెంబరు పిటిషన్‌లో 2,3,4,JDRs ... ది.13-08-2025 ఉదయం 10.30 గం.లకు ...
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
వి.శ్రీనివాస్
రాజమండ్రి అడ్వకేట్,రాజమండ్రి
05-08-2025 సెల్.9701332960

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.51/2016, O.S.No.68/2014
Between:-
శ్రీ నాకం వారి సత్రం, రాజమహేంద్రవరం
Rep by its Executive Officer ...DHr
And
వాసంశెట్టి శేషగిరి రావు, S/o. నాగభూషణం, డోనెం.5-33, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా. ...JDr
వేలం ప్రకటన
పై నెంబరు డిక్రీ ప్రకారం DHr/ వాదికి ఇంధలి JDR/ ప్రతివాది వలన రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం, ఇందలి JDR స్థిరాస్తి వేలం ది.25-08-2025 తేదీన ఉ.10.30 లగాయతు వేలం వేయబడును. ...
వేలం ఆస్తి వివరం
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా, ఉప్పలగుప్తం మండలం, అమలాపురం సబ్ రిజిస్ట్రీలో చేరిన భీమనపల్లి పంచాయితీ భీమనపల్లి గ్రామ జిరాయతీ పట్టం R.S.No.54/1, AC1-02 Cents in AC 3-06Cents హద్దులు. ...
DHr.Value. Rs.1,00,000/-
Amin Value. Rs.16,00,000
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
కళా వెంకట్రావు
DHr.తరపు అడ్వకేట్
భూపయ్య అగ్రహారం
అమలాపురం, సెల్. 9440147955

పెద్దాపురం పురపాలక సంఘం
ఇంజనీరింగ్ విభాగం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
ఆర్.ఒ.సి. నెం. 745/2024-E1 తేది.07-08-2025
పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో మ్యాన్ మజ్దూర్‌లే 3 నెలలకు స్పెషల్ సానిటేషన్ మెయింటెనెన్స్ చేయు పనికి ECV మొత్తం రూ. 10,54,560/-లతో 2వ పిలుపు ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ద్వారా టెండర్లు కోరడమైనది.
డాక్యుమెంట్ లభ్యత (ఆన్ లైన్) : ది.08-08-2025 ఉదయం 11.00 గం॥ల నుండి
బిడ్ దాఖలు ముగింపు తేదీ : ది.14-08-2025 తేదీ సాయంత్రం 5.00 గం॥ల వరకు
ఇతర వివరములు : www.tender.apeprocurement.gov.in
Phone Nos. 9849905811, 9849907062
సం/- కమిషనరు
పెద్దాపురం పురపాలక సంఘం